మల్లికార్జునస్వామికి పట్నాలు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మల్లికార్జునస్వామి, ఖండేలరాయుడు, సీతారామచంద్రస్వామి, నందీశ్వరులను దర్శనం చేసుకున్నారు. ఒగ్గు పూజారులతో స్వామివారికి పట్నాలు వేయించారు. బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు.



న్యూస్‌రీల్

కక్షిదారులకు డిజిటల్ సేవలు



సేవలు ప్రారంభిస్తున్న జడ్జి గణేశ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): కక్షిదారులకు డిజిటల్ సేవలు అందించేందుకు ఈ సేవా కేంద్రం దోహదపడుతుందని జూనియర్ సివిల్ జడ్జి గణేశ్ అన్నారు. స్థానిక కోర్టులో ఏర్పాటు చేసిన ఈ సేవా కేంద్రాన్ని జడ్జి ఆదివారం ప్రారంభించారు. అంతకుముందు సుప్రీంకోర్టు న్యాయమూర్తి తెలంగాణలోని కోర్టుల్లో ఈ సేవాకేంద్రాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. జడ్జి గణేశ్ మాట్లాడుతూ, కేసు స్థితిగతులు, విచారణ, సర్టిఫైడ్ కాపీ తదితర సమాచారం ఈ సేవా కేంద్రాల ద్వారా కక్షిదారులకు అందుతుందన్నారు. సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్, ఏజీపీ ఆంజనేయులు, ఎస్సై శ్రవణ్ కుమార్, న్యాయవాదులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలు



తలపడుతున్న విద్యార్థులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ కృష్ణానగర్ టీవీ గార్డెన్స్‌లో ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా–68వ అండర్–17 రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. గోదావరిఖని ఏసీపీ రమేశ్ పోటీలు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి పీఎం షేక్, సింగరేణి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, పూటా జిల్లా అధ్యక్షుడు సురేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శోభారాణి, కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గంతో నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఖరారు చేశారు. జిల్లా పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పెందోట జగదీశ్‌బాబు(శ్రీరాంపూర్), ప్రధానకార్యదర్శిగా ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్, జాయింట్ సెక్రటరీగా శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయసారథి, కోశాధికారిగా వెంకటేశం, సలహాదారుగా వెంకటస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రవీంద్రనాథ్, ఆడిటర్‌గా వరలక్ష్మిని ఎన్నుకున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి




ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

పెద్దపల్లిరూరల్: జిల్లావాసులు ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని, యాంటి బయాటిక్స్ మందులను మోతాదులో వాడాలని జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్నకుమారి అన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డాక్టర్ రవికిరణ్, శ్రావణ్, మమత, రామకృష్ణ, అనిల్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్లు, డెప్యూటీడెమో రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

పెద్దపల్లిరూరల్: దేవునిపల్లిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జాతర ఉత్సవాలకు సంబంధించిన హుండీలను సోమవారం లెక్కించనున్నట్లు ఆయల ఈవో ముద్దసాని శంకరయ్య ఆదివారం తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

గోదావరి నది పరిశీలన



గోదావరి తీరంలో ఇంగ్లాండ్ బృందం

మంథని: గోదావరి నదిని ఇంగ్లండ్ ప్రతినిధి బృందం ఆదివారం పరిశీలించింది. పర్యాటక ప్రాంతాల సందర్శనలో భాగంగా గోదావరి, కాళేశ్వరం ప్రాజెక్టు విశిష్టతపై స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

అధికారుల సమస్యలకు పరిష్కారం లభించేనా?!

- ఐదేళ్ల తర్వాత ఇదే మొదటి అధికారిక సమావేశం
- సంస్థ వ్యాప్తంగా 2,300 మంది అధికారుల ఎదురుచూపు
- నేడు కొత్తగూడెంలో అధికారులతో యాజమాన్యం భేటీ

సాక్షిప్రతినిధి, కరీంనగర్: సింగరేణి అధికారుల సుదీర్ఘ సమస్యలకు పరిష్కారం లభించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఐదేళ్ల పాటు అధికారుల స్ట్రక్చర్ సమావేశాలు లేక సమస్యలు పరిష్కారం కాలేదు. దీంతో చాలా మంది అధికారులు నిరాశ నిస్పృహలతో విధులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా అంతర్గత పదోన్నతులకు నిబంధనలు అడ్డంకి కావడంతో ఈసమస్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. ఈక్రమంలో ఈనెల 25న కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో అధికారుల సమస్యలపై స్ట్రక్చర్ సమావేశం నిర్వహిస్తోంది. దీనిపై కథనం..

ఏళ్లుగా పెండింగ్‌లో సమస్యలు

సింగరేణి అధికారులు తమ సమస్యల పరిష్కారం కోసం కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నారు. కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ)కు అనుబంధంగా సింగరేణి అధికారుల సంఘం కొనసాగుతోంది. ఈక్రమంలో కొన్నేళ్లుగా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో ఉన్న అధికారుల సంఘం నాయకులు తమ సమస్యలపై సరిగా స్పందించలేదని అసంతృప్తి మొదలైంది. ఈక్రమంలో నిర్వహించిన అధికారుల సంఘం ఎన్నికల్లో కొత్త నాయకత్వం బాధ్యతలు స్వీకరించింది. సీఎంఓఏఐ అధ్యక్షుడిగా లక్ష్మీపతిగౌడ్ ఎంపికయ్యారు. వీరితో పాటు పూర్తి స్థాయి కమిటీ తమ బాధ్యతలను స్వీకరించింది. అధికారుల సమస్యలను సీఎంఓఏఐ నాయకత్వం పలుదఫాలుగా సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకువస్తూనే ఉంది. ఇటీవల రామగుండం పర్యటనకు వచ్చిన సింగరేణి డైరెక్టర్(పా) వెంకటేశ్వర్‌రెడ్డితో అధికారుల సంఘం నాయకులు భేటీ అయ్యారు. గోదావరిఖని ఇల్లెందు క్లబ్‌లో డైరెక్టర్‌తో సమావేశమై సమస్యల పరిష్కారం కోసం స్ట్రక్చరల్ సమావేశానికి గ్రీన్‌సిగ్నల్ తీసుకున్నారు. ఈక్రమంలో సోమవారం అధికారుల సంఘం నాయకులతో యాజమాన్యం భేటీ కానుంది.

అంతర్గత పదోన్నతులే ప్రధాన ఎజెండా

సంస్థ వ్యాప్తంగా సింగరేణి అధికారులకు అంతర్గత పదోన్నతుల్లో అన్యాయం జరుగుతోంది. ఎక్స్‌టర్నల్ అధికారులకు పదోన్నతి కల్పిస్తున్నప్పటికీ



అధికారులతో సమావేశమైన సంస్థ డైరెక్టర్(పా) వెంకటేశ్వర్‌రెడ్డి(ఫైల్)



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

అంతర్గతంగా పదోన్నతుల విషయంలో అన్యాయం జరుగుతోంది. ఈవిషయంలో ఏడేళ్లుగా అధికారులు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. అంతేకాకుండా ఫస్ట్‌క్లాస్ పాసైన అభ్యర్థుల విషయంలో కూడా అన్యాయం జరుగుతోంది.

నేడు స్ట్రక్చరల్ సమావేశం

సింగరేణి అధికారుల నాయకత్వంతో యాజమాన్యం కొత్తగూడెంలో సోమవారం భేటీ కానుంది. ఈ సందర్భంగా అధికారుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు సంఘం నాయకులు సిద్ధమవుతున్నారు. చాలా ఏళ్ల తర్వాత సమావేశం నిర్వహిస్తుండడంతో సమస్యల పరిష్కారానికి మోక్షం లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు.

ప్రధాన డిమాండ్‌లు ఇవే..

- న్యాయబద్ధమైన పదోన్నతి పాలసీ అమలు చేయాలి.
- ఫీల్డ్‌లో పనిచేస్తున్న అధికారులకు సౌకర్యాలు ఆధునీకరించాలి.
- పారదర్శక బదిలీ పాలసీ అమలు చేయాలి.
- ఆసుపత్రి సౌకర్యాలు ఆధునీకరించాలి. రిటైర్డ్ అధికారులకు మెడికల్ కార్డు అందించాలి.
- ఓసీపీలో అధికారులకు ఏసీ వాహనాలు కేటాయించాలి.
- కోలిండియాలోని పదోన్నతి పాలసీ సింగరేణిలో అమలు చేయాలి.
- ఫస్ట్‌క్లాస్ మేనేజర్ల విషయంలో ఇటీవల వచ్చిన సర్క్యులర్‌లో మార్పులు చేయాలి.
- సీడీఏ రూల్స్‌లో నిబంధనలు సడలించాలి.
- ఎంక్వైరీ సమయంలో రావాల్సిన బెనిఫిట్స్ ఆపవద్దు.
- కోలిండియా ప్రకారం డిజిగ్నేషన్స్ కేటాయించాలి.
- అధికారులకు ఉచిత విద్యుత్, ఐఐటీ ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి.

సమస్యలపై దృష్టి సారించాం

సింగరేణి అధికారుల సమస్యలపై చర్చించేందుకు స్ట్రక్చరల్ సమావేశానికి అంగీకరించిన ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు. ఐదేళ్ల తర్వాత మొదటిసారిగా జరిగే ఈ సమావేశంలో పదోన్నతులపై ప్రధానంగా దృష్టి సారించాం. అంతర్గత పదోన్నతుల విషయంలో అన్యాయం జరిగింది. చాలా మంది అధికారులు ఈవిషయంలో అసంతృప్తిగా ఉన్నారు. దీన్నే ప్రధాన ఎజెండాగా పెట్టాం. మేము గెలిచిన తర్వాత మొదటిసారిగా జరిగే స్ట్రక్చరల్ సమావేశంలో అన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సమస్యల పరిష్కారంలో రాజీలేకుండా ముందుకు సాగుతాం.

– లక్ష్మీపతిగౌడ్,
అధికారుల సంఘం అధ్యక్షుడు, సింగరేణి

268 కేంద్రాలు.. 81వేల మెట్రిక్ టన్నులు

- జిల్లాలో సాఫీగా ధాన్యం సేకరణ
- 12,829 మంది రైతులకు రూ.189 కోట్ల చెల్లింపు
- సన్నరకాలకూ రూ.8.46 కోట్ల జమ



ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ సాఫీగా సాగుతోంది. నిబంధనల మేరకు తేమశాతం ఉన్న వడ్లను సకాలంలోనే తూకం వేస్తున్నారు. ఆ వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ఇప్పటివరకు 268 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. శనివారం వరకు 12,829 మంది రైతుల నుంచి 81,538 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డురకం 31,701మెట్రిక్ టన్నులు, సన్నరకం 49,836 మెట్రిక్ టన్నులు ఉన్నాయి.

320 కొనుగోలు కేంద్రాలు..

జిల్లాలో ఈసారి 329 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించినా 320 కేంద్రాలనే ప్రారంభించారు. ఇందులో ఇప్పటివరకు 268 కేంద్రాల్లోనే కొనుగోళ్లు మొదలు పెట్టారు. రామగుండం, మంథని నియోజకవర్గాల పరిధిలో ఇంకా వరి కోతలు ఊపందుకోలేదు. సన్న, దొడ్డురకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో వేర్వేరుగా సేకరిస్తున్నారు. అందుకు అవసరమైన యంత్రాలు (ప్యాడీ క్లీనర్లు, తేమ నిర్ధారణ యంత్రాలు, హజ్ క్లీనర్లు)తోపాటు గన్నీ సంచులు అందుబాటులో ఉంచారు. రైతులకు అవసరమైన తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించారు.

ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ..

రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి తెచ్చి ఇబ్బందులు పడకుండా ప్రతీ మండలానికి ఇద్దరు ప్రత్యేకాధికారులను నియమించారు. వీరు క్రమం తప్పకుండా ధాన్యం కొనుగోళ్లు, సౌకర్యాలు పర్యవేక్షిస్తున్నారు. నిబంధనల మేరకు సన్నరకం ధాన్యంలో 33 రకాల అధికారులు ధ్రువీకరిస్తారు. ఆ తర్వాతే వాటిని తూకం వేసి రైతులకు బోనస్ అందేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

12,829 మంది రైతులు..
రూ.189 కోట్ల చెల్లింపులు..

జిల్లాలో ఇప్పటివరకు(శనివారం వరకు) 12, 829 మంది రైతులు తీసుకొచ్చిన 81,337 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఈ ధాన్యం విక్రయించిన రైతులు, ధాన్యం, ఇతర వివరాలను ట్యాబ్‌లో నమోదు చేసిన రైతులకు రూ.151.20 కోట్లు చెలించినట్లు అదనపు కలెక్టర్ వేణు వెల్లడించారు. అలాగే సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. సన్నరకం ధాన్యం ఇప్పటివరకు విక్రయించిన 4,051 మంది రైతులకు రూ.15.34 కోట్లు చెల్లించే బోనస్ ట్యాబ్ ఎంట్రీ పూర్తయింది. అందులో ఇప్పటివరకు రూ.8.46 కోట్లు రైతులకు చెల్లించారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్



మాట్లాడుతున్న భూపాల్

జ్యోతినగర్(రామగుండం): భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ కోరారు. స్థానిక అన్నపూర్ణకాలనీలో ఆదివారం సీపీఎం జిల్లా మూడో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. అస్సాంలో అత్యాచారాలు, జమ్ముకశ్మీర్ ముక్కలు, మణిపూర్‌లో జాతుల మధ్య చిచ్చుతో మారణహోమం సృష్టిస్తున్నారని ఆరోపించారు. నాంసాని శంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు టి.జ్యోతి, నాయకులు వై.యాకయ్య, తుమ్మల రాజారెడ్డి, ఎ.ముత్యంరావు, ఎ.మహేశ్వరి, వేల్పుల కుమారస్వామి, ఎం.రామాచారి, మెండే శ్రీనివాస్, ఎం.రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి, బూడిద గణేశ్, సారయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ప్రవేశ పెట్టారు. ఇందులో బీజేపీ సర్కారుకు వ్యతిరేకంగా ఈనెల 26న జిల్లాలో నిరసన చేపట్టాలని, వ్యవసాయాభివృద్ధికి ప్రాజెక్టులు, చెక్‌డ్యామ్‌లు నిర్మించాలన్నారు.

'పత్తిపాక'తో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



రిజర్వాయర్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు

- ప్రణాళికాబద్ధంగా రిజర్వాయర్ నిర్మాణం
- రైతుల అభీష్టం మేరకే పనులు
- రాష్ట్రమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి

ధర్మారం(ధర్మపురి): సాగు, తాగునీటి సమస్య పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తోందని రాష్ట్రమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పత్తిపాకలో ప్రతిపాదిత రిజర్వాయర్ నిర్మాణ స్థలాన్ని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్, కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి ఆదివారం పరిశీలించారు. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, మిడ్ మానేర్, వరదకాలువ, లోయర్ మానేర్‌డాం కాంగ్రెస్ హయాంలోనే నిర్మించారని మంత్రి తెలిపారు. జిల్లాలోని చివరి ఆయకట్టు నీటి సమస్య పరిష్కారానికి పత్తిపాకలో రిజర్వాయర్ నిర్మిస్తున్నామన్నారు. దీనిద్వారా ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలోని సుమారు 2.40లక్షల ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలమవుతుందని తెలిపారు. రైతుల అభిప్రాయం మేరకు రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు డీపీఆర్ తయారు చేస్తున్నామన్నారు. అటవీ అనుమతు, ఇతర సమస్యలను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్‌కు సూచించారు. విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం 2016లో పత్తిపాకలో రిజర్వాయర్ నిర్మిస్తామని హామీ ఇచ్చి రైతులను మోసం చేసిందన్నారు. అదనపు కలెక్టర్ వేణు, ఎస్సారెస్పీ చీఫ్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సోగాల తిరుపతి, మాజీ సర్పంచ్ బద్దం సుజాత, మాజీ ఎంపీటీసీ బద్దం అజయ్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- 48 గంటల్లోనే ధాన్యం రైతులకు డబ్బుల చెల్లింపు
- సన్నవడ్లు క్వింటాల్‌కు రూ.500 బోనస్
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్

పెద్దపల్లిరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. రంగాపూర్, దేవునిపల్లి గ్రామాల్లో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సాఫీగా సాగేలా చర్యలు తీసుకున్నామన్నారు. తూకం వేసిన వెంటనే రైతులకు రశీదు అందిస్తున్నామని అన్నారు. సన్నరకం వడ్లు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌తో పాటు ధాన్యం డబ్బును 48గంటల్లోపే రైతు బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నామని వెల్లడించారు. గతంలో మాదిరిగా తూకంలో కోతలు లేవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు బండారు రామ్మూర్తి, గంట రమేశ్, చింతపండు సంపత్, మహేందర్, బొక్కల సంతోష్, అశోక్, నరేందర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని అభివృద్ధి చేస్తా..

పెద్దపల్లి పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పలు వార్డుల్లో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. పట్టణ ప్రజలకు కనీస వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటాని అన్నారు. పట్టణ కూడళ్లను సుందరీకరించే పనులు చేపడతామని తెలిపారు. ఆయన వెంట పలువురు కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

పర్యాటకం.. ఆధ్యాత్మికం

- రామగిరి అందం.. ఎల్.మడుగు సోయగం
- కాళేశ్వరం నుంచి మంథని వరకు టూరిజం హబ్
- ఆలయాలు, చారిత్రక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు



కాళేశ్వరంలోని ముక్తీశ్వరస్వామి



రామగిరి ఖిలా

మంథని: కాళేశ్వరం నుంచి మంథని వరకు ఆధ్యాత్మిక క్షేత్రాలు భక్తిభావం పెంపొందిస్తున్నాయి. చారిత్రక రామగిరి ఖిలా నుంచి సహజ సిద్ధమైన ఎల్.మడుగు సరస్సు వరకు పర్యాటక ప్రాంతాలు టూరిస్టులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ఆకాశన్నంటే ఎత్తులోని చెట్లు.. లోతైన లోయలు.. సువిశాలంలో పరుచుకున్న పచ్చదనం.. ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదం పంచుతున్నాయి. ఇప్పుడు వీటిన్నింటినీ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నడుం బిగించింది.

ప్రాచీన శిల్పకళా సంపదకు నిలయం రామగిరి ఖిలా

రామగిరి ఖిలాను జాతీయ స్థాయిలో పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు మాస్టర్ ప్లాన్‌తో ముందుకు సాగుతున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు ఇటీవల ప్రకటించారు. ప్రాచీన ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకోసం రూ.5 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

తొలుత రామగిరి కోట..

శిల్పకళా సంపద ప్రాచీన సంస్కృతికి అద్దంపడుతోంది రామగిరి ఖిలా క్రీ.శ. ఒకటో శతాబ్దంలో కోటగా రూపుదిద్దుకుందని చరిత్రకారులు చెబుతున్నారు. కోట శత్రుదుర్భేద్యమైన రక్షణ స్థావరంగా విరాజిల్లింది. వివిధ రాజవంశాలకు వందల ఏళ్లపాటు ఆశ్రయం ఇచ్చింది. దుర్గం అంతర్భాగంలో సాలుకోట, సింహాలకోట, జంగేకోట, ప్రతాపరుద్రుల కోట, అశ్వాల, కొలువుశాల, మొఘల్‌శాల, చెరశాల, గజశాల, భజనశాల, సభాస్థలితోపాటు రహస్య స్థలాలు, రహస్య మార్గాలు, సొరంగాలు, తోపులు, ఫిరంగిగుండ్లు దర్శనమిస్తాయి. అన్ని దుర్గాల్లో ఇది పటిష్టంగా ఉండి వజ్రకూటంగా ప్రసిద్ధి చెందింది.

సీతమ్మ కొలను ప్రత్యేకత..

సీతమ్మ కొలను గుంతలో పసుపు, ఎరుపు రంగునీరు దర్శనమివ్వడం విశేషం. పిల్లల ఫిరంగిలోంచి దూరితే సంతాన ప్రాప్తి కలుగుతుందని పర్యాటకుల విశ్వాసం. రామగిరి ఖిలా సుందర దృశ్యాలు, ప్రాకారాలు సందర్శకులను ఆకర్షిస్తాయి. శ్రీరాముని మూలవిరాట్టు ఉన్న స్థలంలో కొండచరియ కింద సుమారు వెయ్యిమంది తలదాచుకోవచ్చు. రామగిరి కోటలో ఇరువైపులా తొమ్మిది ఫిరంగులు, నలబై తోపులు ఉన్నాయి. శ్రీరాముడు తన వనవాస కాలంలో రామగిరి కోటపై తపస్సు చేసి గుహలో శివలింగం ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి. కొండ పైనుంచి వచ్చే నీటిధార బిలం నుంచి లోయలోకి ప్రవహిస్తోంది. ఇక్కడ సీతాదేవి స్నానమాచరించారని ప్రతీతి. కొండపై సీతారాములు, నంది విగ్రహం ఉంది. నీటిధార నేరుగా శివలింగం, నంది విగ్రహాలపై పడడం విశేషం. వర్షాకాలంలో రామగిరి పర్వతాల నుంచి జాలువారే జలపాతాలు కనువిందు చేస్తాయి.

గోదావరి మధ్య ఎల్.మడుగు



ఎల్.మడుగు

గోదావరినది మధ్య సహజ సిద్ధంగా ఏర్పడిన అతి పెద్ద లోయలాంటి సరోస్సే ఎల్.మడుగు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల మధ్య మంథని మండలం ఖాన్‌సాయిపేట– శివ్వారం అటవీప్రాంతంలో ఎల్.మడుగు రెండు గుట్టల మధ్య ప్రవహిస్తుంది. దీని చుట్టూ ఆనుకొని ఉన్న దట్టమైన అటవీ ప్రాంతం.. ఎత్తయిన కొండలు, గుట్టలు.. రెండు కొండల మధ్య జలజలపారే గోదావరి నది.. సరస్సులో దాహం తీర్చుకుని ఆకాశానికి ఎగిరే పక్షుల కిలకిలరావాలు.. నీటిలో తేలియాడుతూ అప్పుడప్పుడు పైకి ఎగిరే చేపల విన్యాసాలు తనివితీరా తిలకించాల్సిందే. గుంపులుగా కదిలే చేపపిల్లల దృశ్యం మన కళ్లెదుటే అక్వేరియం ఉందా అనే అనుభూతి కలిగిస్తుంది. సుమారు రెండు కిలోమీటర్ల పరిధిలో సరస్సు విస్తరించి ఉంది.

ఎకో పార్క్‌గా అభివృద్ధి..

ప్రకృతి అందాలు ఆరబోసుకొన్న ఎల్.మడుగును ఎకో పార్క్‌గా అభివృద్ధి చేసేందుకు రూ.2 కోట్లు కేటాయించారు. ఇప్పటికే ఖానాపూర్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గోదావరి నది వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అలాగే కాళేశ్వరం పర్యాటక అభివృద్ధికి రూ.115 కోట్లు కేటాయించగా, మంథని గోదావరి నది తీరంలోని గౌతమేశ్వరఘాట్ ప్రగతి పనులకు రూ.2కోట్లు కేటాయించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఇటీవల మంథనిలో పర్యటించారు. అలాగే టూరిజం శాఖ కమిషనర్ న్యాలకొండ ప్రకాశ్‌రెడ్డి సైతం రామగిరిని సందర్శించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ మంత్రి శ్రీధర్‌బాబు సతీమణి కాగా, టూరిజం శాఖ కమిషనర్ ప్రకాశ్‌రెడ్డి ఈ ప్రాంతానికి సంధించిన ఐపీఎస్ అధికారి కావడంతో మంథనికి కలిసివచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

నిండుకుండలా 'ఎల్లంపల్లి'



జలకళ సంతరించుకున్న ఎల్లంపల్లి ప్రాజెక్టు

రామగుండం: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ఆదివారం 20.175 టీఎంసీల నిల్వ ఉందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. గతేడాది నవంబర్ 24వ తేదీన ప్రాజెక్టులో 17.45 టీఎంసీల నీటి నిల్వలే ఉన్నాయి. ప్రస్తుతం 633 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, అంతే మొత్తంలో అవుట్ ఫ్లో ఉంది. ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలకు 318 క్యూసెక్కులు, రామగుండం, మంచిర్యాల మిషన్ భగీరథకు 81 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూన్ ఒకటో తేదీ(ఇరిగేషన్ ఇయర్) నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టు నుంచి 329.87 టీఎంసీల నీరు గోదావరి నది ద్వారా సముద్రంలోకి వెళ్లిందని, నంది పంపుహౌస్‌కు 23.98 టీఎంసీలు ఎత్తిపోశామని అధికారులు వివరించారు.

ఘనంగా ఎన్‌సీసీ డే



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీలో ఆదివారం ఎన్‌సీసీ డే ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ కేర్ టేకర్ అధికారి శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించిన జీడీకే-11

గోదావరిఖని: సింగరేణి సంస్థ సీఎండీ బలరాం ఆదేశాల మేరకు ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఏరియాలోని జీడీకే-11గనిలో ప్రొడక్షన్ డే నిర్వహించారు. ఈసందర్భంగా అత్యధికంగా 4వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు గని ఏజెంట్ శ్రీనివాస్, మేనేజర్ మల్లేశం తెలిపారు. అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించిన ఉద్యోగులు, అధికారులు, కార్మికులను జీఎం అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



దొంగలు ధ్వంసం చేసిన బీరువా

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రంలోని సాగి అంజలి ఇంట్లో చోరీ జరిగింది. అంజలి వారం రోజుల క్రితం వైద్యం చేయించుకోవడానికి మంచిర్యాలకు వెళ్లింది. ఆదివారం సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చింది. ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో అనుమానంతో లోనికి వెళ్లి చూసింది. దీంతో బీరువా పగులగొట్టి కనిపించింది. అందులోని సమారు 10 తులాల బంగారంతోపాటు రూ.1.50లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. సమాచారం అందుకున్న ఎస్సై ప్రసాద్ వెంటనే గ్రామానికి చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

పెద్దపల్లిరూరల్: పెద్దకల్వల గ్రామ స్టేజీ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొప్పుల హర్షవర్ధన్(11) అనే బాలుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. తల్లిదండ్రులు శంకర్, శైలజతో కలిసి బైక్‌పై ప్రయాణిస్తుండగా.. పెద్దకల్వల వద్ద రాజీవ్ రోడ్డుపై మరమ్మతు పనులు చేసే ప్రాంతంలో ఎలాంటి హెచ్చరికలు లేని కారణంగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు.

ఉత్సాహంగా సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ లెవల్-2 పరీక్ష

- వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు



అల్ఫోర్స్ కళాశాలలో మ్యాథ్స్ స్పెల్‌బీలో పాల్గొన్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో పాఠశాలలో సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్‌బీ లెవల్-2 పరీక్ష ఉత్సాహంగా సాగింది. విద్యార్థులకు వారివారి కేటగిరీలవారీగా పరీక్షలను నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి 11 వరకు స్పెల్‌బీ, 11 గంటల నుంచి 12 వరకు మ్యాథ్స్‌బీ పరీక్షను నిర్వహించారు. కేటగిరి 1లో భాగంగా 1, 2 తరగతుల విద్యార్థులకు, 2వ కేటగిరిలో 3, 4 విద్యార్థులకు, 3వ కేటగిరిలో 5, 6, 7, 4వ కేటగిరి లో 8, 9, 10 విద్యార్థులకు నిర్వహించారు. లెవల్-2లో అర్హత సాధించిన విద్యార్థులను హైదరాబాద్‌లో జరిగే లెవల్-3 పరీక్షలకు నిర్వాహకులు ఎంపిక చేయనున్నారు.

విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్న సాక్షి స్పెల్‌బీ

ఇంగ్లిష్, మ్యాథ్స్‌ను విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా నేర్చుకుంటారని విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తోంది సాక్షి స్పెల్‌బీ అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి అన్నారు. సాక్షి స్పెల్‌బీ పరీక్షలను ఆయన పరిశీలించి మాట్లాడారు. స్పెల్‌బీతో ఆరోగ్యవంతమైన పోటీ విద్యార్థుల మధ్య ఏర్పడుతోందన్నారు. ఈ పరీక్షకు వివిధ పాఠశాలల నుంచి లెవల్-1లో సెలెక్ట్ అయిన సుమారు 160 మంది విద్యార్థులు హాజరైనట్లు సాక్షి కరీంనగర్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాక్షి ఏడీవీటీ డిప్యూటీ మేనేజర్ ఊరగొండ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ ముస్కుల విద్యాసాగర్‌రెడ్డి, సిబ్బంది వేముల శ్రీనివాస్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. సాక్షి స్పెల్‌బీకి ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వైఫై, అసోసియేట్ స్పాన్సర్‌గా రాజమండ్రికి చెందిన ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరిస్తున్నాయి.

కొత్త పదాలు నేర్చుకుంటా



స్పెల్‌బీ లెవల్-2 పరీక్ష రాశా. లెవల్-1 కంటే లెవల్-2లో న్యూ వర్డ్స్ నేర్చుకున్నా. చాలా కొత్త పదాలున్నాయి. బుక్స్‌లో లేని పదాలు కూడా ఉన్నాయి. అవి ఏమిటో తెలుసుకున్నా. జోనల్ 3 రౌండుకు కూడా సెలెక్టవుతా. ఇంకా కొత్తకొత్త పదాలు నేర్చుకుంటా.
– ఆదిత్య, చాక్లెట్ హైస్కూల్

ఇంగ్లిష్‌పై పట్టు సాధించా



స్పెల్‌బీతో ఇంగ్లిష్‌పై పట్టు సాధించా. స్పెల్లింగ్స్ కూడా చాలావరకు నేర్చుకున్న. సెకండ్ రౌండ్ బాగా రాశా. జోనల్ ఫైనల్ రౌండ్‌కు కూడా అర్హత సాధిస్తా. ఇంగ్లిష్ పదాలు మరిన్ని నేర్చుకోవాలనిపిస్తోంది. స్పెల్‌బీ పరీక్ష బాగుంది. ఇంగ్లిష్‌లో కొత్తకొత్త పదాలు తెలిశాయి.
– అనన్యశ్రీ, శ్రీప్రగతి హైస్కూల్

పోటీ పరీక్షలకు ఉపయోగం



సాక్షి ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలు రాసేవారికి నాలెడ్జ్ ఇంప్రూవ్ అవుతుంది. పోటీ పరీక్షలకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆంగ్లంలో కొత్త పదాలను తెలుసుకోవడం, గణితంలో కొత్త ఫార్ములాలను తెలుసుకునే అవకాశం ఈ పరీక్షలతో సాధ్యమైంది.
– శివెన్‌రెడ్డి, అల్ఫోర్స్ ఈటెక్నో హైస్కూల్

గణితంలో పట్టు సాధిస్తా



మ్యాథ్స్‌బీ లెవల్-2 పరీక్ష రాశా. న్యూ ఫార్ములాలు చాలా నేర్చుకున్నా. చాలా కొత్త పదాలున్నాయి. బుక్స్‌లో లేని ఫార్ములాలు కూడా ఉన్నాయి. అవి ఏమిటో తెలుసుకున్నా. జోనల్ రౌండుకు కూడా సెలెక్టవుతా. గణితంలో బాగా పట్టు సాధించాలని ఉంది.
– విష్మారెడ్డి, సెయింట్ జార్జ్ హైస్కూల్

స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ బాగుంది



సాక్షి మీడియా ఆధ్వరంలో నిర్వహించిన స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ పరీక్షలు చాలా బాగున్నాయి. ఇలాంటి పరీక్షలకు మాకు ఎంతగానో ఉపయోగపడతాయి. కొత్త పదాలు, కొత్త ఫార్ములాలు తెలుసుకోవచ్చు. టెక్స్ట్ బుక్‌లో లేని ఎన్నో పదాలు, ఫార్ములాలు ఇందులో ఉన్నాయి.
– ఇఫ్రా ఫాతిమా, అక్షర ఇంటర్నేషనల్ స్కూల్

వర్ష జ్యువెలర్స్ ప్రారంభం



ప్రారంభోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ తదితరులు

కరీంనగర్: 23 ఏళ్ల అనుభవంతో నగరంలోని టవర్ సర్కిల్‌లో ఎలగందుల వీరేశం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్షా జ్యువెల్లర్స్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ సంజయ్ ఆదివారం ప్రారంభించారు. కిలో వెండి కొనుగోలు పై 20 గ్రాముల వెండి కాయిన్, 10 గ్రాముల బంగారు ఆభరణాలపై 10గ్రాముల వెండి ఉచితంగా అందిస్తున్నామని, ఈ అవకాశం కేవలం వారం రోజులు మాత్రమేనని నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర మహిళా చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, కరీంనగర్, రామగుండం ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, మక్కాన్‌సింగ్ ఠాకూర్, మేయర్ సునీల్ రావు, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, ఆరెపల్లి మోహన్, నాయకులు చల్ల హరిశంకర్, నిర్వాహకులు ఎలగందుల వీరేశం, పెద్ది వేణుగోపాల్, బొద్దు రాజు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవ సభ మళ్లీ వాయిదా

మంథని: పట్టణంలో సోమవారం జరుగాల్సిన ప్రజాపాలన విజయోత్సవ సభ మరోమారు ఈనెల 26వ తేదీకి వాయిదా పడింది. తొలుత ఈనెల 24వ తేదీన సభ నిర్వహించాలని ఖరారు చేశారు. అనివార్య కారణాలతో ఈనెల 25కు ఆ తర్వాత ఈనెల 26 వాయిదా పడినట్లు జిల్లా ఇన్‌చార్జి పౌర సంబంధాల అధికారి జగన్ ఆదివారం తెలిపారు.

జల్సాల కోసం చోరీలు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని: జల్సాల కోసం చోరీలు చేస్తూ ఓ యువకుడు పోలీసులకు చిక్కాడు. గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి చోరీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. స్థానిక రమేశ్‌నగర్‌కు చెందిన ఐత వెంకటేశ్(27) అనే నిందితున్ని చోరీ కేసులో అరెస్ట్ చేశారు. గోదావరిఖనిలో కారు నడుపుకుంటూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తూ తాగుడుకు బానిసై డబ్బుల కోసం అప్పులు చేస్తుంటాడు. చేసిన అప్పులు తీర్చేందుకు దొంగతనాలు చేస్తుంటాడు. కారు నడుపుతున్న సమయంలో మధ్యాహ్నం వేళల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను గమనిస్తూ రాత్రి సమయాల్లో ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు, ఇతర వస్తువులు చోరీ చేస్తాడు. చోరీ సొత్తును అమ్ముకొని వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 14న స్థానిక ద్వారకానగర్‌లోని చిలకపల్లి రమేశ్ అనే సింగరేణి ఉద్యోగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడి 4 తులాల బంగారం, 30 తులాల వెండి ఎత్తుకెళ్లాడు. వాటిని తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తుండగా.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితున్ని పట్టుకున్నారు. బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. రెండు బంగారు బ్రాస్ లెట్లు, జత వెండి పట్టీలు, రెండు జతల కడియాలు, రెండు వెండి గొలుసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై భూమేశ్, క్రైం టీమ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, వెంకటేశ్‌ను అభినందించారు.

మరుపురాని..మరువలేని.. మధుర క్షణాలు..



అపూర్వ విద్యార్థుల గ్రూప్‌ఫొటో



గురువులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

జ్యోతినగర్(రామగుండం): సుమారు 25ఏళ్ల క్రితం ఒకే స్కూల్‌లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో కలుసుకున్నారు. తొలుత ప్రధానోపాధ్యాయుడు మాధవరేణ కొమురయ్య, ఉపాధ్యాయులను కార్యక్రమానికి ఆహ్వానించి సన్మానించారు. ఆ తర్వాత విద్యార్థులు జ్ఞాపకాలు, ఆనాటి మధుర క్షణాలను నెమరువేసుకున్నారు. భవిష్యత్‌లోనూ ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తూ ఆపదలో ఉన్న, సమస్యలు ఎదుర్కొంటున్న వారిని ఆదుకోవాలని తీర్మానించారు. ఆటాపాటలతో సరదాగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, రాజు, ప్రకాశ్, కిషన్, అశోక్, శ్రీధర్, పూర్వ విద్యార్థులు నాగమల్లేశ్వరి, లక్ష్మి, శైలజ, కవిత, దుర్గ, సుమలత, మంగ, శారద, సరళ, వసంత, నగేశ్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

55ఏళ్ల తర్వాత..

ఓదెల(పెద్దపల్లి): ఓదెల ప్రభుత్వ హైస్కూలులో 1969 నుంచి 1979 వరకు పదో తరగతి చదివిన 35మంది విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తొలుత గురువులు జనార్దన్‌రావు, విద్యాసాగర్, చంద్రరెడ్డి, భూమయ్యను శాలువాలతో సన్మానించారు. పూర్వ విద్యార్థులు బొడకుంట కుమారస్వామి, సూత్రాల రాజేశం, గంగిశెట్టి రాజన్న, గొట్టిముక్కుల చంద్రమౌళి, రాంకిషన్‌రాజు, తాటికొండ రామన్న, గొర్ల మొండయ్య, ముక్క కిషన్, దండు కృష్ణారెడ్డి, ఎల్.రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లక్రైం: చంద్రపేటకు చెందిన వేముల రాజశేఖర్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై పెద్దూరు నుంచి బైపాస్ రోడ్డుపై చంద్రంపేటకు వస్తుండగా.. పెద్ద బోనాల చిన్న బోనాల మధ్యలో బైపాస్ రోడ్డుపై పోసిన వరి ధాన్యం కుప్పను ఢీకొని ప్రమాదానికి గురయ్యాడు.



పెగడపల్లి: ఆరవెల్లి నుంచి సుద్దపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై ఆరబోసిన ధాన్యం కుప్పల వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఆరవెల్లి గ్రామానికి చెందిన పాలోజి గంగాధర్ అనే వ్యక్తి మృతిచెందాడు.

రోడ్డుపై ధాన్యం.. జర భద్రం..

రోడ్లపై పోసిన ధాన్యం నిల్వలు వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. రహదారులపై ధాన్యం ఆరబోయొద్దని చెబుతున్నా కొంతమంది అలాగే పోస్తున్నారు. ప్రధాన రహదారిపై ఒకపక్క ధాన్యాన్ని పోయడంతో రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



పెద్దపల్లిరూరల్: రైతులు పండించిన ధాన్యం దిగుబడులను ఆరబోసేందుకు అవసరమైనన్ని కల్లాలు అందుబాటులో లేక ప్రధాన రోడ్ల పక్కనే ఆరబోసుకుంటున్నారు. పెద్దపల్లి నుంచి ఎలిగేడుకు వెళ్లే దారిపై లోకపేట వద్ద ఇలా రైతులు ధాన్యాన్ని ఆరబోశారు.



రామగిరి(ముత్తారం): బేగంపేట క్రాస్ రోడ్ నుంచి ముత్తారం మండల కేంద్రానికి వెళ్లే దారి ఇది. ముత్తారం మండలం మైదంబండలో కొందరు రైతులు రహదారులపై ధాన్యాన్ని ఆరబోస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



కరీంనగర్‌రూరల్: చామనపల్లిలో రోడ్డు మీదే రైతులు ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబెట్టేందుకు స్థలం సరిపోక కొందరు రైతులు రోడ్డునాశ్రయిస్తున్నారు.



జమ్మికుంట: జమ్మికుంట, వీణవంక రోడ్డులో జగ్గయ్యపల్లి గ్రామంలో రోడ్డుపై ధాన్యం కుప్పలు పోయడంతో వాహనదారుల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. డబుల్ రోడ్డులో ఒకపక్క రోడ్డును ధాన్యం ఆరబెట్టేందుకు ఆక్రమించారు.



సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ధాన్యం కేంద్రాలకు తీసుకొచ్చిన తరువాత తేమ శాతం వచ్చేదాకా ఆరబెట్టాల్సి ఉంటుంది. ధాన్యం పోయడానికి స్థలం లేక రోడ్ల వెంట పోయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

జ్యోతినగర్: 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 కరాటే పోటీల్లో పాల్గొన్న పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలకు ఎంపికైనట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని టీవీ గార్డెన్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 కరాటే పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-17 బాలికల విభాగంలో 32 కిలోల పోటీల్లో సిరిచందన(మెదక్), 36 కిలోల పోటీల్లో రూపాశ్రీ(నిజామాబాద్), 40 కిలోల పోటీల్లో తనూశ్రీ(వరంగల్), 44 కిలోల పోటీల్లో శ్రీజ(కరీంనగర్), 48 కిలోల పోటీల్లో రక్షిత(కరీంనగర్), 56 కిలోల పోటీల్లో సిరిచందన(మహబూబ్‌నగర్), 60 కిలోల పోటీల్లో ఐశ్వర్య(వరంగల్), 64 కిలోల పోటీల్లో అనూష(ఆదిలాబాద్), 68 కిలోల పోటీల్లో శ్రీహరిణి(వరంగల్), 68 కిలోలు ఆపై విభాగంలో శ్రీహిత రాజ్(కరీంనగర్), బాలుర విభాగంలో 35 కిలోల పోటీల్లో సాత్విక్(కరీంనగర్), 40 కిలోల పోటీల్లో ఆదిత్య తేజ(కరీంనగర్), 45 కిలోల పోటీల్లో శ్రావణ్‌కుమార్(కరీంనగర్), 50 కిలోల పోటీల్లో అన్వేష్(వరంగల్), 54 కిలోల పోటీల్లో హర్షవర్ధన్(వరంగల్), 58 కిలోల పోటీల్లో సుభాష్‌రావు(నిజామాబాద్), 62 కిలోల పోటీల్లో శ్రీచరణ్(కరీంనగర్), 66 కిలోల పోటీల్లో ఎండీ ఫియాజొద్దీన్(రంగారెడ్డి), 70 కిలోల పోటీల్లో హర్షవర్ధన్(కరీంనగర్), 74 కిలోల పోటీల్లో హర్షతేజ(ఖమ్మం), 78 కిలోల పోటీల్లో షేక్ ఇస్మాయిల్(మెదక్), 82 కిలోల పోటీల్లో మల్లేశ్(మహబూబ్‌నగర్), 82 కిలోల పోటీల్లో షేక్ అబ్దుల్లా(మెదక్) జాతీయస్థాయి కరాటే అండర్-17 పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్, ఎంపిక కమిటీ సభ్యులు నారాయణమ్మ, శోభారాణి, ప్రకాశ్ జాబితా విడుదల చేశారు.

'ఖని'లో సింగరేణి ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్

- ఆధునిక హంగులతో నిర్మాణం
- రూ.15 కోట్లు.. 340 దుకాణాలు
- బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల వద్దకు ప్రతిపాదనలు
- గ్రీన్‌సిగ్నల్ వస్తే ఏడాదిలోగా పనులు పూర్తి
- షాపింగ్ మాల్ డిజైన్‌పై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి!



ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్ ఊహాచిత్రం

గోదావరిఖని: సింగరేణి ఆధ్వర్యంలో రామగుండం నగరంలో ఆధునిక హంగులతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో కంపెనీకి చెందిన క్వార్టర్లను కూల్చివేసిన యాజమాన్యం.. ఆ స్థలంలో భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని యోచిస్తోంది. ప్రధాన చౌరస్తా నుంచి భాస్కర్‌రావుభవన్ వరకు మెయిన్ రోడ్డుకు కుడివైపు 340 దుకాణాలతో జీప్లస్ -వన్ పద్ధతిన కాంప్లెక్స్ నిర్మించాలని ప్రయత్నిస్తోంది. దీనికి సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేస్తోంది. సుమారు రూ.15కోట్ల అంచనా వ్యయంతో దీనిని నిర్మించనుంది. దీనిపై సింగరేణి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

డిజైన్ సిద్ధం..!

రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆధునిక హంగులతో.. పారిశ్రామిక ప్రాంతానికి వన్నెతెచ్చేలా ఆర్కిటెక్ట్ ద్వారా షాపింగ్ కాంప్లెక్స్ డిజైన్ సిద్ధం చేశారు. సింగరేణి యాజమాన్యం తన క్వార్టర్లను కూల్చివేశాక.. ఏం చేస్తుందనే విషయంపై కార్మిక క్షేత్రంలోని అన్నివర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఈక్రమంలో షాపింగ్ డిజైన్ బహిర్గతం కావడంతో త్వరలోనే కాంప్లెక్స్ ఆచరణలోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

జీప్లస్ – వన్ పద్ధతిలో..

వ్యాపార విస్తరణలో భాగంగా సింగరేణి సంస్థ కమర్షియల్ భవనాలను నిర్మిస్తోంది. గోదావరిఖని ప్రధాన చౌరస్తా నుంచి భాస్కర్‌రావు భవన్ వరకు సింగరేణి కూల్చివేసిన క్వార్టర్ల స్థానంలో 340 షాపులను నిర్మించేందుకు యాజమాన్యం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వీటిని ఆధునిక హంగులతో నిర్మించి వ్యాపారులకు అద్దెకు ఇవ్వాలని నిర్ణయించింది. షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట పార్కింగ్, వెనకాల సర్వీస్ రోడ్డు నిర్మించేలా డిజైన్ చేశారు.

ఆర్కిటెక్చర్లతో సమాలోచనలు..

సింగరేణి నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్‌పై పలువురు ఆర్కిటెక్చర్లతో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సమాలోచనలు చేశారని తెలిసింది. దీనిని ఆధునిక పద్ధతిలో నిర్మించేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. ఈక్రమంలో ఆర్కిటెక్చర్లను పిలిపించి డిజైన్‌లను తయారు చేయిస్తున్నట్లు సమాచారం. కొన్ని డిజైన్లు సింగరేణి అధికారులకు కూడా పంపినట్లు చెబుతున్నారు.

గ్రీన్‌సిగ్నల్ రాగానే ముందుకు..

సింగరేణి యాజమాన్యం త్వరలో నిర్మించే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం బోర్డు పరిశీలనలో ఉంది. బోర్డు నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే ఏడాదిలోగా 340 క్వార్టర్లను నిర్మించాలని యాజమాన్యం యోచిస్తోంది. వీటి నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ సంస్థకు అప్పగించాలని చూస్తోంది. తద్వారా అద్దె రూపంలో సంస్థకు ఆదాయం భారీగా సమకూరే అవకాశం ఉంది.